క్లుప్తంగా

కల్కి అవతారంలో వేణుగోపాలస్వామి



కల్కి అలంకరణలో స్వామివారు

బోట్‌క్లబ్‌: ధనుర్మాస వ్రతమహోత్సవాలు, రజిత దశవతార అలంకార ఉత్సవాల్లో భాగంగా స్థానిక దేవాలయంవీధిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి శనివారం కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి ఉదయం అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొన్నారు.

కల్కి అవతారంలో సీతారామస్వామి

బోట్‌క్లబ్‌: ధనుర్మాస వ్రతమహోత్సవాలు, రజిత దశవతార అలంకార ఉత్సవాల్లో భాగంగా స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి శనివారం కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి ఉదయం అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొన్నారు.

ఆకట్టుకున్న నృత్యాలు



జానపద నృత్యం చేస్తున్న విద్యార్థులు

బోట్‌క్లబ్‌: స్థానిక ఐటీఐ ప్రాంగణంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కాకినాడ ఉమెన్స్‌ కళాశాల విద్యార్థులు జానపద, గిరిజన సాంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు. ట్రేడ్‌ ఫెయిర్‌ ఎగ్జిబిషన్‌లో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఈ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి ఆధ్వర్యంలో చేసిన ఈ నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది విద్యార్థులతో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ నృత్యాలు చేశారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



అరట్లకట్ట సదస్సులో మాట్లాడుతున్న సర్పంచ్‌ సత్యవేణి

కరప: భూసంబంధిత సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని గ్రామసర్పంచ్‌ గోపి సత్యవేణి కోరారు. అరట్లకట్టలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు.ఈ సదస్సులో రెవెన్యూ అధికారులు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. భూవిస్తీర్ణంలో హెచ్చు, తగ్గులు ఉన్నా, సబ్‌ డివిజన్‌ కోసం, మ్యూటేషన్‌, పట్టాదార్‌ పాసు పుస్తకాల్లో తప్పులున్నా రైతులు దరఖాస్తు చేసుకుంటే, పరిశీలించి, సవరిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌ డి.దుర్గాప్రసాద్‌, మండల సర్వేయర్‌ ఎస్‌.రూపావతి, ఆర్‌ఐ పవన్‌, వీఆర్వో పీఎస్‌ హరిశ్చంద్రప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

థర్డ్‌ పార్టీతో ప్రత్యేక ఆడిట్‌ చేయించాలి

బాలాజీచెరువు: జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీలో ఆర్థిక అక్రమ లావాదేవీలపై థర్డ్‌ పార్టీతో ప్రత్యేక ఆడిట్‌ చేయించాలని కాకినాడకు చెందిన సోషల్‌ యాక్టివిస్టు ఎంవీఆర్‌ ఫణీంద్ర రాష్ట్ర గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. యూనివర్సిటీ ఏర్పడినప్పటి నుంచి నేటి వరకూ ఉన్న వీసీలు, రిజిస్ట్రార్లు, డైరెక్టర్లు ఇష్టానురాజ్యంగా ఖర్చు చేశారని, వారిపై విచారణ చేసి రికవరీ చేయాలని కోరారు. డైరెక్టరేట్లకు ఆడిట్‌ అభ్యంతరాలు వస్తున్నా పట్టించుకోవడం లేదని, ముఖ్యంగా అనుబంధ కళాశాలలు అఫిలియేషన్‌ బకాయిలు ఉన్న వాటికి ప్రతి ఏడాది అనుమతి ఇస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గవర్నర్‌తో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రికి ప్రతులను పంపించారు.

కాకినాడ అధికారుల ఫోన్‌ నెంబర్లు

మున్సిపల్‌ అధికారులు

కమిషనర్‌	9100945696
అదనపు కమిషనర్‌	9849907096
డిప్యూటీ కమిషనర్‌	9949921555
ఏసీపీ	9989743049
ఎంహెచ్‌వో	9949432320
ఎస్‌ఈ	9959988639
మేనేజర్‌	7093519888
టీపీఆర్వో	9701385284
అకౌంట్‌ ఆఫీసర్‌	9849907084
సిటీ మిషన్‌ మేనేజర్‌	7901610084
జీజీహెచ్‌లో ముఖ్యమైన ఫోన్‌ నంబర్లు	
సూపరింటెండెంట్‌	98499 03870, 0884 2302001
సీఎస్‌ ఆర్‌ఎంవో	98499 03871
డీసీఎస్‌ ఆర్‌ఎంవో	98499 03871

సమస్యలమయం

- అంధకారంలో కుళాయి చెరువు పార్క్‌
- చీకటి పడితే భయపడుతున్న సందర్శకులు
- పేరుకుపోయిన చెత్త, వేధిస్తున్న పార్కింగ్‌ సమస్య
- పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు

బోట్‌క్లబ్‌: పట్టణంలో కుళాయి చెరువు పార్కు సమస్యలమయంగా మారింది. సరైన నిర్వహణ లేకపోవడంతో అంధకారంలో మగ్గుతోంది. చెత్తా చెదారంతో దర్శనమిస్తోంది. పార్క్‌ను నగర పాలక సంస్థ పట్టించుకోకపోవడంతో అధ్వానంగా తయారైంది. దీంతో సందర్శకులు పార్కుకు వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. తెల్లవారు జామున 5 గంటలు నుంచి ఉదయం 9 గంటలు వరకూ, సాయంత్రం 4 గంటలు నుంచి రాత్రి 9 గంటలు వరకూ ఈ పార్కు తెరచి ఉంచుతారు. ఉదయం, సాయంత్రం వాకింగ్‌ చేసుందుకు సుమారు వెయ్యి మంది వరకూ వస్తుంటారు. ఇక సాయంత్రం వేళ కుటుంబ సభ్యులతో సరదా గడిపేందుకు వచ్చే వారు మరో 500 నుంచి 700 వరకూ ఉంటుంది. ఇలా నిత్యం వేల సంఖ్యలో ఈ పార్క్‌కు వస్తుంటారు.

అంధకారంలో..

కుళాయి చెరువు పార్కులో సమస్యలు తిష్ట వేశాయి. చీకటి పడితే ఇక్కడ అంతా అంధకారమే అలుముకుంటుంది. ఈ పార్కులు సుమారు వంద విద్యుద్దీపాలు ఉంటాయి. వాటిలో 60 మరమ్మతులకు గురయ్యాయి. దీంతో వెలుగు లేక పార్కుకు వచ్చే వారు, వాకర్స్‌ ఇబ్బంది పడుతున్నారు. అంతేకాక ఇది అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారింది.

పాడైన వాకింగ్‌ ట్రాక్‌

వాకింగ్‌ ట్రాక్‌ పలు ప్రాంతాల్లో పాడైపోవడంతో వాకర్స్‌ ఇబ్బంది పడుతున్నారు. గ్రావెల్‌తో చేసిన ఈ ట్రాక్‌ నిర్మాణం ఎగుడు దిగుడుగా ఉన్నందున వాకింగ్‌కి వచ్చేవారు అసౌకర్యానికి గురవుతున్నారు.



విద్యుద్దీపాలు లేని వాకింగ్‌ ట్రాక్‌

పారిశుధ్యం అధ్వానం

పార్కులో నిత్యం వచ్చే వాకర్స్‌ తిని పడేసిన వ్యర్థాలతో అధ్వానం తయారైంది. పార్కు శుభ్రం చేసిన వ్యర్థాలు దక్షిణం వైపు ఫెన్సింగ్‌ వద్ద వేసి పడవేసి వదిలేయడంతో అక్కడ దుర్వాసన వెదజల్లుతోంది. కళాక్షేత్రం క్యాంటీన్‌ వ్యర్థాలు సైతం పార్క్‌ ఆవరణలో పడవేయడంతో నిత్యం వాకర్స్‌కు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు .

పార్కింగ్‌ సమస్య

నిత్యం వందలాది మంది వచ్చే సందర్శకులు వచ్చే ఈ పార్కుకు పార్కింగ్‌ సమస్య వేధిస్తోంది. సందర్శకుల వాహనాలు పార్కింగ్‌ చేసుకునేందుకు సరైన స్థలం లేక రోడ్డుకు రెండు పక్కల పార్కింగ్‌ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కార్పొరేషన్‌ అధికారులు స్పందించి సందర్శకులకు పార్కీ చేసుకునే సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.



పార్కులో అలంకార ప్రాయంగా ఉన్న విద్యుద్దీపం

దుర్వాసనతో ఇబ్బంది



పార్కులో చెత్తా చెదారం పెరిగిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. రాత్రి సమయాల్లో మందుబాబులు తిని పడేసిన మాంసం ముక్కలు, పార్కుకు వచ్చే వారు పడేసిన చిరుతిళ్లు, తినుబండారాలతో అధ్వానంగా ఉంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. నిర్వహణ లేకపోవడంతో సందర్శకులు వచ్చేందుకు ఇష్టపడడం లేదు.

– దొరబాబు, సందర్శకుడు

విద్యుద్దీపాలు లేక..



పార్కుల సమస్యలు రోజు రోజుకి పెరుగుతున్నాయి. విద్యుత్‌ దీపాలు సుమారు రెండు నెలల క్రితమే పాడైనా ఎవరూ పట్టించుకోవడంలేదు. చీకటి పడితే పార్కు రావాలంటే మహిళలు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి సమయాల్లో మందుబాబులు హల్‌చల్‌ చేస్తున్నారు.

– దూసర్లపూడి రమణరాజు, నగర పౌరసంక్షేమ సంఘం కన్వీనర్‌

పదవులు బాధ్యతలను మరింత పెంచుతాయి



క్లబ్‌ ఉత్తమ సేవకులను సత్కరిస్తున్న ప్రముఖులు

బాలాజీచెరువు: పదువులు బాధ్యతలను మరింత పెంచుతాయని, అలయన్స్‌క్లబ్‌ జీవిత కాలపు సభ్యత్వాలు పెంచాలని అలయన్స్‌ ఇంటర్నేషనల్‌ కమిటీ చైర్మన్‌ చప్పిడి వేంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ప్రైవేట్‌ హోటల్లో శనివారం అలయన్స్‌ గవర్నర్‌ వనుం శ్రీనివాసరావు అధ్యక్షతన క్యాబినేట్‌ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ గ్రామస్థాయిలో అలయన్స్‌సేవలు విస్తృతం చేయాలని కోరారు. మార్చి 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ చెన్నైలో నిర్వహించే అంతర్జాతీయ అలయన్స్‌ సమావేశానికి సభ్యులు హాజరుకావాలని సూచించారు. అనంతరం బెస్ట్‌ సర్వీస్‌ అవార్డులు అందజేశారు.ఈ కార్యక్రమంలో దీలిప్‌కుమార్‌ సదానాని, మునిరెడ్డి, వరలక్ష్మి, కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

బాలాజీచెరువు: పీఆర్‌ జూనియర్‌ కళాశాలలో కూటమి ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని నగర ఎమ్మెల్యే వనమాడి వేంకటేశ్వరరావు ప్రారంభించారు. స్కూల్‌ విద్యార్థులతో పాటు ఇంటర్మీడియెట్‌ విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించామన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగంచేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ జ్యోతుల రాంబాబు ఒకేషనల్‌ ప్రిన్సిపాల్‌ ఎం.తిరుపతిరెడ్డి, పిల్లి శివప్రసాద్‌ పాల్గొన్నారు.

అంధుల ఆశాదీపం లూయిస్‌ బ్రెయిలీ

కాకినాడ రూరల్‌: అంధుల పాలిట ఆశ దీపం లూయిస్‌ బ్రెయిలీ జయంతిని స్థానిక వాకలపూడిలోని ఉమా ఎడ్యుకేషనల్‌ టెక్నికల్‌ సొసైటీలో దివ్యాంగుల విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమా ఎడ్యుకేషనల్‌, టెక్నికల్‌ సొసైటీ డైరెక్టర్‌ ఎస్‌పీ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ లూయిస్‌ బ్రెయిలీ బాల్యంలో ప్రమాదవశాత్తు రెండు కళ్లను కోల్పోయి తన నాలుగో ఏటా పూర్తిగా అంధుడయ్యాడైనా అసాధారణ ప్రతిభ సామర్థ్యాలు గల వ్యక్తిగా రాణించి, అప్పటికి అమలులో ఉన్న ఎంబ్లైన్‌ టైపులో పద్ధతిలో చదువుకుని, 17 సంవత్సరాల వయస్సులోనే అదే స్కూలులో ప్రొఫెసరుగా నియమితులయ్యారన్నారు. పగలు విద్యార్థులకు బోధిస్తూ, రాత్రులు అంధులు తేలికగా చదవగలిగే, రాయగలిగే లిపి తయారీకి కృషి చేసినట్టు తెలిపారు. సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌ కె.నారాయణ రెడ్డి, జాయింట్‌ డైరెక్టర్‌ సత్యనారాయణ రెడ్డి ఉమా ఎడ్యుకేషనల్‌ టెక్నికల్‌ సొసైటీ వారు అనేక రకాల కార్యక్రమాలను ప్రత్యేకంగా దివ్యాంగుల విద్య, ఉపాధి, సాంఘిక, శిక్షణ, సాధికారిత అంశాలలో కొత్తకొత్త కార్యక్రమాలను నిర్వహించడంలో ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ ఆటలు పోటీలు నిర్వహించి, వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది ఎస్‌.ఉమారెడ్డి, ఎస్‌ఏ నాయుడు, టి.హరిబాబు, ప్రత్యేక ఉపాధ్యాయ సంస్థ సిబ్బంది, ప్రత్యేక ఉపాధ్యాయ శిక్షణ సిబ్బంది, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న ఉమా ఎడ్యుకేషనల్‌, టెక్నికల్‌ సొసైటీ డైరెక్టర్‌ ఎస్‌పీ రెడ్డి

ఐడీఏ, అడబాల ట్రస్ట్‌ ఆధ్వర్యంలో

కాకినాడ రూరల్‌: సర్పవరం జంక్షన్‌లో కాకినాడ ఐడీఏ, అడబాల ట్రస్ట్‌ ఆధ్వర్యంలో లూయిస్‌ బ్రెయిలీ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ ఐడీఏ కార్యదర్శి డాక్టర్‌ అడ్డాల సత్యనారాయణ హాజరై మాట్లాడారు. 1809 జనవరి 4న జన్మించిన లూయిస్‌ బ్రెయిలీ ఉబ్బెత్తుగా ఉండే చుక్కలతో అంధులు చదివే పద్ధతిని కనిపెట్టి వారి చీకటి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. బ్రెయిలీ లిపి వలన చూపు లేని వారు చాలా సులభంగా విద్య నేర్చుకోగలుగుతున్నారని చెప్పారు. ప్రపంచంలోని గొప్ప వ్యక్తుల్లో లూయిస్‌ బ్రెయిలీ స్థానం చిరస్థాయిగా నిలిచిపోతుందని డాక్టర్‌ అడ్డాల తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్‌, నిమ్మకాయల వెంకటేశ్వర రావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు ,ప్రసాద్‌ నాయుడు ,రాజా తదితరులు పాల్గొన్నారు.



లూయిస్‌ బ్రెయిలీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్‌ అడ్డాల సత్యనారాయణ తదితరులు

విద్యార్థులు మనోధైర్యంతో ముందుకెళ్లాలి

బోట్‌క్లబ్‌: విద్యార్థులు మనోధైర్యంతో ముందుకు వెళ్లాలని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి ప్రవీణ అన్నారు. స్థానిక మధురానగర్‌లోని ప్రజావిద్యాలయంలో శనివారం విద్యార్థులకు రక్షణ చట్టాలు, సైబర్‌ నేరాలపై అవగాహన కల్పించారు. అమ్మాయిలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు ఎదురైన భయపడకుండా ప్రతిఘటించాలన్నారు. లైంగిక వేధింపులపై పిల్లలకు అవగాహన కల్పించారు. ప్రజా విద్యాలయ నిర్వహణ బాగుందని విద్యాలయ కరస్పాండెంట్‌ వక్కలంక రామకృష్ణను అభినందించారు. ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు తల్లులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తెలుగుదనం ఉట్టిపడేలా ముగ్గులు వేసి అనందరినీ ఆకట్టుకున్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజా విద్యాలయం ప్రధానోపాధ్యాయిని ఏఎస్‌ భవాని పాల్గొన్నారు.



విద్యార్థులకు రక్షణ చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి ప్రవీణ

‘వెలమ’ సంక్షేమానికి కృషి చేస్తా



కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకట గణేష్‌కుమార్‌

- కొప్పుల వెలమ కార్పొరేషన చైర్మన్‌ పొలిపర్తి

కాకినాడ సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వెలమ సంఘీయుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్‌ చైర్మన్‌ పొలిపర్తి వెంకట గణేష్‌కుమార్‌ తెలిపారు. శనివారం కాకినాడ ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కొప్పుల వెలమ సంఘీయుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో కొప్పుల వెలమ సంఘీయులు ఎదుర్కొంటున్న సమస్యలను సంఘ నాయకులు పొలిపర్తి గణేష్‌కుమార్‌ దృష్టికి తీసుకురావడంతో సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సభకు అధ్యక్షత వహించిన మాకిరెడ్డి భాస్కర గణేష్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో ఏడు నియోజకవర్గాల పరిధిలో తునిలో కొప్పుల వెలమ సంఘీయులు అధికంగా ఉన్నందున తుని నియోజకవర్గాన్ని తమ కులస్తులకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్‌ డైరెక్టర్లు బర్ల అప్పారావు, పైలా సాంబశివరావు, వెలమ ఫౌండేషన్‌ చైర్మన్‌ మూర్తి, రాజాన రాజు, తాయి నగేష్‌, ఏటుకూరి నాగమణి, పిల్లారిశెట్టి రాజేశ్వరి, కోకా కృష్ణారావు, బొబ్బిలి గోవిందు, కొంపా అప్పారావు, సన్నీబాబు, వేసారపు దుర్గాప్రసాద్‌, రొంగల అప్పాజీ, కర్రి శ్రీను, రుక్కల రవి, మడ్డు శ్రీను, ఆదిరెడ్డి శ్రీనివాస్‌, బీసీ నాయకులు చొల్లంగి వేణుగోపాల్‌, వనర్తి బద్రి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌ విద్యా కేంద్రంగా భారతదేశం



ఫార్మసీ విద్యార్థుల ఇండక్షన్‌ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): భారత దేశం భవిష్యత్‌ విద్యాకేంద్రంగా అవతరిస్తుందని, ప్రపంచమంతా అంతటా భారతదేశ విద్యార్థుల వైపు చూస్తుందని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో బీఫార్మసీ, ఎం ఫార్మసీ విద్యార్థులకు ఇండక్షన్‌ పోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉంటూ మంచి పుస్తక పఠనం చేయాలన్నారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ భవిష్యత్‌ ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు అత్యున్నత ఆలోచనలతో సాగాలన్నారు. నూతన ఆవిష్కరణలతో కొత్త ఔషధాల అభివృద్ధి, ఉత్పత్తికి నెలవైన ఫార్మా రంగంలో అవకాశాలకు కొదవ లేదని, అన్ని సబ్జెక్టులపై పట్టు సాధిస్తే జీవితంలో విజేతలుగా నిలుస్తారన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌ రవీంద్ర మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో దేశంలో ఫార్మ రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, ప్రపంచ ఔషధశాలగా భారతదేశం పేరొందిందన్నారు. కోవిడ్‌ సమయంలో ఫార్మాసిస్టులు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో విశిష్టమైన సేవలు అందించారని, ఫార్మాసిస్టులకు ఏ రంగంలో లేని డిమాండ్‌ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కోర్సుల విభాగాధిపతి డాక్టర్‌ డి.భవానీ, డైరెక్టర్‌ పద్మప్రియ, జిల్లా డ్రగ్స్‌ కంట్రోల్‌ ఆఫీసర్‌ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

14 ఏళ్లు పూర్తి చేసుకున్న ‘యునైటెడ్‌ పాస్టర్స్‌ ప్రేయర్‌’



యునైటెడ్‌ పాస్టర్స్‌ ప్రేయర్‌ అసోసియేషన్‌ సేవకుల సహవాసం కార్యక్రమంలో పాల్గొన్న పాస్టర్లు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్‌ చీడిగలో యునైటెడ్‌ పాస్టర్స్‌ ప్రేయర్‌ అసోసియేషన్‌ సేవకుల సహవాసం కార్యక్రమాన్ని శనివారం బెరాక ప్రార్థనా మందిరంలో రెవరెండ్‌ బి.దివాకర్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. దేవుని సేవలో తరిస్తూ 14ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ యునైటెడ్‌ పాస్టర్స్‌ ప్రేయర్‌ అసోసియేషన్‌ 15వ సంవత్సరంలో అడుగు పెడుతుందని, దేవుని సువార్తను అన్ని వైపులా చాటడమే అసోసియేషన్‌ ప్రధాన లక్ష్యమని దివాకర్‌ వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్‌ నాయకులు పాస్టర్లు ఉప్పాడ మోసే, బి.విజయకుమార్‌ మాట్లాడారు. కార్యక్రమంలో పాల్గొన్న పాస్టర్లను నూతన వస్త్రాలు, కానుక, ఆత్మీయ విందును అందించారు. కార్యక్రమంలో పాస్టర్లు సాల్మన్‌, ఎం.ఆనోకు, టి. సత్యానందం, బి.కిరణ్‌బాబు, పి.డేవిడ్‌ రాజు, జోసఫ్‌ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సౌండ్‌ సిస్టమ్‌ ఓనర్స్‌, హెల్పర్స్‌ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా లోవరాజు



కాకినాడ జిల్లా సౌండ్‌ సిస్టమ్‌ ఓనర్స్‌, హెల్పర్స్‌ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లా సౌండ్‌ సిస్టమ్‌ ఓనర్స్‌ హెల్పర్స్‌ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నడికట్ల లోవరాజు ఎన్నికయ్యారు. శనివారం కాకినాడ నగరం రెవెన్యూ కాలనీలోని శెట్టిబలిజ సంక్షేమ సంఘం స్థలంలో సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సౌండ్‌ సిస్టమ్‌ ఓనర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా నలు మూలల నుంచి విచ్చేసిన సభ్యులు చర్చించారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నడికట్ల లోవరాజు, ఉపాధ్యక్షుడిగా పెంకే మారయ్య, వడ్డి రాజు, ఇందనబాల, మల్లాడి సత్తిబాబు, రెడ్డి మల్లిఖార్జున రావు, మేడిశెట్టి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. సంఘం కార్యదర్శిగా కుక్కల గనిరాజు, జాయింట్‌ కార్యదర్శిగా వల్లూరి కిరణ్‌కుమార్‌, కోశాధికారిగా డింగ్‌ రాజు, జాయింట్‌ కోశాధికారులుగా దుత్తుర్తి శ్రీనులను సభ్యులు ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా ఎండీ కరీం, రాజేష్‌ వరసాల, విజయకుమార్‌, బచ్చల మోహన్‌, మచ్చా సత్యనారాయణ, చీకట్ల త్రినాథ్‌, చిట్టిరాజు, కాదా రామకృష్ణ, చీకట్ల సత్యనారాయణ, కేతినీడి రాంబాబు, ఎగ్గాడ స్టీఫెన్‌, దాసరి విజయకుమార్‌ ఎన్నికయ్యారు. సమావేశానికి జేకే ఎంటర్‌ప్రైజెస్‌, ఆదిత్య ఎలక్ట్రానిక్స్‌లు సహకరించారు. జిల్లా నలు మూలల నుంచి పెద్ద సంఖ్యలో సౌండ్‌ సిస్టమ్‌ ఓనర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

జిమ్‌ ప్రారంభం



జిమ్‌ ప్రారంభించి, వ్యాయామం చేస్తున్న డాక్టర్‌ నరసింహం

కాకినాడ క్రైం: కాకినాడలోని రంగరాయ మైదానంలో జిమ్‌(వ్యాయామశాల)ను డీఎంఈ, డాక్టర్‌ ఎన్‌టీఆర్‌ యూహెచ్‌ఎస్‌ వీసీ, ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ డీఎస్‌వీఎల్‌ నరసింహం శనివారం రాత్రి ప్రారంభించారు. రూ.2.5 లక్షలు విలువైన వ్యాయామ పరికరాలను జిమ్‌లో అందుబాటులో ఉంచామని వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఏ.విష్ణువర్ధన్‌ తెలిపారు. ఆర్‌ఎంసీ విద్యార్థుల కోసం ఈ జిమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరెన్సిక్‌ హెచ్‌వోడీ డాక్టర్‌ ఉమామహేశ్వరరావు, డాక్టర్‌ సతీష్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ధనుర్మాసం పంచమిని పురస్కరించుకుని స్వామి వారికి అభిషేకాలు, పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో భక్తులకు ఉదయం, సాయంత్రం ప్రసాద వితరణ, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు వేమూరి సోమేశ్వర శర్మ, అల్లకి రాజగోపాల్‌, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్‌, చెరుకూరి రాంబాబు, సన్నిదిరాజు వెంకన్నలు పూజా కార్యక్రమాలు చేశారు.

నేడు యూటీఎఫ్‌ స్వర్ణోత్సవాలు



పీఆర్‌ కళాశాలలో జరిగే యూటీఎఫ్‌ స్వర్ణోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ 1974లో ఏర్పాటు చేసిన నాటి నుంచి నేటి వరకూ 16 విద్యా వైజ్ఞానిక మహాసభలు వివిధ ప్రాంతాల్లో జరిగాయని జిల్లా ఆడిట్‌ కమిటీ కన్వీనర్‌ ఐ.ప్రసాదరావు శనివారం తెలిపారు. 17వ రాష్ట్ర యూటీఎఫ్‌ విద్యా వైజ్ఞానిక స్వర్ణోత్సవాలు కాకినాడ పీఆర్‌ కళాశాలలో ఆదివారం జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇప్పటి వరకు జరిగిన 16 ప్రాంతాల జాతాలు (యునిసెఫ్‌ జెండాలను) ఆయా ప్రాంతాల కార్యకర్తలు కాకినాడ చేరుకుంటున్నాయన్నారు. జాతా జెండాలను తీసుకుని కాకినాడ నగరంలో ప్రదర్శన నిర్వహించినట్టు తెలిపారు. ఆదివారం ప్రారంభ సమావేశంలో ఆయా 16 జాతా జెండాలను సమావేశం ఆవరణలో ఆవిష్కరిస్తారని తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన మహాసభల్లో మొదటి మహాసభ 1974లో రాజమండ్రిలో జరిగిందన్నారు. తరువాత వరుసగా 1977లో ఖమ్మం, 1981లో భీమవరం, 1986లో విజయవాడ, 1989లో నెల్లూరు, 1993లో గుంటూరు, 1997లో ఒంగోలు సభలు జరిగాయన్నారు. 8వ సభలు రజతోత్సవ వేడుకలు కాకినాడలో 2000 సంవత్సరంలో జరిగాయన్నారు. తొమ్మిదోది 2003లో హైదరాబాద్‌, పదోది 2007లో విజయవడ, 11వది 2009లో నల్గొండ, 12వది 2011లో కర్నూలు, 13వది 2013లో తిరుపతి, 14వది 2014లో ఏలూరు, 15వది 2017లో శ్రీకాకుళం, 16వది 2022లో అనంతపురంలో జరిగాయన్నారు. ప్రస్తుతం 17వ మహాసభలు స్వర్ణోత్సవాలు కాకినాడలో జరుగుతున్నాయని ప్రసాదరావు వివరించారు. ఈ 50 సంవత్సరాల కాలంలో అనేక సమస్యలను పరిష్కరించమన్నారు. భవిష్యత్తులో విద్యారంగాన్ని అభివృద్ధి కోసం, ఉపాధ్యాయ సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టినట్టు ఆయన వివరించారు.

నేడు వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాల వాకర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు వాకర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు మహమ్మద్‌ సైఫుల్లా, వి.కొండలరావు తెలిపారు. ఈశిబిరంలో బీపీ, సుగర్‌ పరీక్షలతో పాటు కంటి పరీక్షలు చేస్తారన్నారు.డాక్టర్లు మహాస్నత్‌, మాధురి వైద్య సేవలందిస్తారని చెప్పారు. వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.